క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట: పట్టణానికి చెందిన చెన్న ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ సాధించడంతో అతని స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ప్రవీణ్‌ను శాలువా, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందిన ప్రవీణ్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితుల తోడ్పాటుతో తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. కార్యక్రమంలో స్నేహితులు తోటకూరి శ్రీధర్, రంజన్‌కుమార్, గాయాల సుమన్, చెన్న సురేష్, హేమంత్, ఐత రవి, కొండేటి మధు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు అపహరణ

ఖానాపురం : విద్యుత్ మోటారు అపహరణకు గురైన సంఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...అశోక్‌నగర్‌కు చెందిన రవి తుంగబంధం కాల్వపై మోటారు బిగించి పంటలకు నీరు అందిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మోటారును అపహరించుకుపోయారు. బాధిత రైతు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి ఎస్సై రఘుపతి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానితుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

చెట్ల కొమ్మల తొలగింపు



వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్న తరుణంలో పోలీసులు స్పందించి కట్ర్యాల శివారులో ఉన్న వరంగల్–ఖమ్మం జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం జేసీబీ సహాయంతో తొలగించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



రాయపర్తి: మండలంలోని గట్టికల్, జగన్నాథపల్లి, గన్నారం గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి పూసల శ్రీమాన్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మంచాల సుమన్, రమేష్, సాయి, రాకేష్, సంపత్, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

వర్ధన్నపేట: నూతన సంవత్సర వేడుకలకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై చందర్ అన్నారు. డీజేలు ఏర్పాటు చేయవద్దని, మద్యం సేవించి రోడ్లపై శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా తులసిపూజ దినోత్సవం



నల్లబెల్లి: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం తులసి పూజ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని తులసి చెట్టుకు పురోహితులు, అర్చకులు పెండోట మురళీ మోహనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సందర్శకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త తాటిపెల్లి రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

వర్తక సంఘం కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సార రాములు, ఉపాధ్యక్షుడిగా బూరుగుల బాబురావు, కోశాధికారిగా కటకం సాంబమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా శింగిరికొండ రమేష్, కార్యదర్శులుగా ఆడెపు కొమురయ్య, నల్లా నర్సింహారెడ్డిలు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా మరికొంత మంది ఎన్నికయ్యారు.

నెక్కొండ : క్రిస్మస్ వేడుకల కేక్ కట్ చేస్తున్న ఎస్సై మహేందర్



నల్లబెల్లి : సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ ఈపీ ప్రసాద్





వర్ధన్నపేట : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఘనంగా క్రిస్మస్ సంబురాలు

నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు ఉదయం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవ సందేశాన్ని అందజేశారు. నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు క్రైస్తవులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రపంచ శాంతికై ఏసుప్రభు బోధనలు చేశారని ప్రజలు శాంతియుత మార్గంలో పయనించాలని వారు అన్నారు. కార్యక్రమాల్లో ఎస్సైలు, ఆయా పార్టీల జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



నర్సంపేట : క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



నర్సంపేటలో..



సంగెం : గవిచర్లలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ రమ



ఖానాపురం : కేక్ కట్ చేస్తున్న ఎస్సై రఘుపతి



దుగ్గొండి : కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



నర్సంపేట రూరల్ : కేక్ కట్ చేస్తున్న రెండో వార్డు కౌన్సిలర్ జుర్రు రాజు యాదవ్



రాయపర్తి : కొత్తూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

కమ్యూనిస్టుల త్యాగాలు ఆదర్శం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్

దుగ్గొండి: కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారుల దోపిడీని నివారించి వారికి అండగా నిలిచే పాలక పార్టీలను తుద ముట్టించి శ్రామిక రాజ్యస్థాపనకు కృషి చేయడమే అమరవీరుల త్యాగాలకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. సిరిబొమ్మల లక్ష్మీనారాయణ, కత్తి సాంబయ్యల 35వ వర్ధంతి సందర్భంగా మండలంలోని రేబల్లెలో వారి స్తూపాల వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా గ్రామంలో ఎర్ర జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. మంద రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ శ్రమదోపిడీకి వ్యతిరేకంగా సంపద సమాజంలో ప్రతి ఒక్కరికి సమానంగా దక్కాలని, లింగ, మత, కుల ప్రాంత బేధం పోవాలన్నారు. లక్ష్మీనారాయణ, సాంబయ్య, మద్దికాయల ఓంకార్ అడుగుజాడల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పార్టీ కట్టుబాట్లకు నిలిచి నీతి నిజాయితీ, విలువలకు కట్టుబడి పనిచేసి అసాంఘిక మూకల తూటాలకు బలై ఓంకార్‌ను కాపాడి చరిత్రలో ఎంతో త్యాగాన్ని చేసిన గొప్ప మహనీయులుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, జిల్లా నాయకులు రాజు, సాంబయ్య, ఐలోని, చేరాలు, డాక్టర్ కోటేశ్వర్, ఐలోని, సుధాకర్, మొగిలి, సాయిలు, సుధాకర్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణ, సాంబయ్యల స్తూపాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తుల అహ్వానం

సంగెం: మండలంలోని గవిచర్లలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్పీ ప్రసన్నలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లతో పాటు 7 నుంచి 10వ తరగతిలో ఖాళీల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండలానికి చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ. 125, ఓసీలు రూ.200లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం'

ఐనవోలు : మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవేంద్ర నగర్ (కాప్రా) రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్రెంగ జిల్లా అధ్యక్షుడు, ఆర్ఐ మరుపట్ల మల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వాహణలో భాగంగా ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తుండగా ఆర్ఐ దుండగులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వం విచారణ చేపట్టి దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

నిర్మించారు...కూల్చేశారు

వర్ధన్నపేట: వర్ధన్నపేట మునిసిపల్ అభివృద్ధిలో భాగంగా ఆరు నెలల క్రితం వరంగల్–జాతీయ రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు లక్షలాది రూపాయలతో నిర్మించారు. ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన డివైడర్ తిరిగి అదే అభివృద్ధి పేరుతో ఏడాది పూర్తి కాకముందే సంగెపు వాగు సమీపంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ డివైడర్ మంగళవారం అర్ధరాత్రి కూలదోసి రోడ్డుపై చదును చేశారు. ఎందుకు నిర్మించారో, తిరిగి ఎందుకు కూలదోశారో అంతుపట్టడం లేదని పట్టణవాసులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా కార్యాలయం సెలవు కావడంతో ఎవరు అందుబాటులోకి రాలేదు.



డివైడర్‌ను కూలదోసి చదును చేసిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల శివారు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి పక్కనే ఎండిన చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపైకి వంగి వేలాడుతుండడంతో మంగళవారం రాత్రి కడారిగూడేనికి చెందిన ద్విచక్రవాహనదారుడు దోపతి రవీందర్‌రెడ్డి వెళ్తుండగా కొమ్మ అతనిపై పడడంతో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందతున్నాడు, రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెపుతున్నారు.

టాటా ఏస్ ఢీకొని ఒకరికి..

బైక్‌పై రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనదారుడిని ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం అతి వేగంగా వ్యక్తిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఆవుల సతీష్ తన ద్విచక్ర వాహనంపై అంబేడ్కర్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతూ వర్ధన్నపేట– జఫర్‌గఢ్ రోడ్డుకు మలుపు తిరుగుతున్న సమయంలో ఖమ్మం నుంచి వరంగల్ వస్తున్న టాటాఏస్ సతీష్‌ను ఢీ కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. చిదురాల వేణుగోపాల్–గీత, డాక్టర్ మార్త రమేష్, మహాలక్ష్మి ఫర్టిలైజర్ అసోసియేషన్ నర్సంపేట, కనుగంటి ఉమామహేశ్వరి–రమేష్, రాణి–వెంకటేశ్వర్లు, శ్రీనివాస్–రజిత, దయాకర్, రమేష్–ధనలక్ష్మి, రాజ్‌కమలాకర్‌రెడ్డి, నర్మద, ధనుష్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫా సురేష్, కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాంఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, శంకరయ్య, చెంచారావు, వేణు, రాజు, భరత్, కార్తీక్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, పాల్గొన్న భక్తులు

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- టీఎస్ఈఈయూ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ –327 పాటుపడుతోందని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో టీఎస్ఈఈయూ –327 రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో టీఎస్ఈఈయూ –327 ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదయ్య, కార్యదర్శి చిట్ల ఓదెలు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండ శ్రీనివాస్, నాయకులు అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఐలేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్

ఆచరణాత్మక అమలుతోనే సుపరిపాలన

కేయూ క్యాంపస్: పాలనా నిర్ణయాలు, విధానాలు ఆచరణాత్మకంగా అమలు జరిగినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్‌హెచ్ఆర్ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని సుపరిపాలన దినోత్సవాన్ని హనుమకొండలోని ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం అంతర్జాతీయ ప్రకృతి గ్రంథాలయం, పరిశోధన కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనలో అన్నివర్గాల ప్రజలకు ప్రాతినిథ్యం అవసరమన్నారు. సమావేశంలో తెలంగాణ జనవేదిక కన్వీనర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, అటల్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత, ప్రకృతి వైద్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఆచార్య గజ్జెల రామేశ్వరం, కిసాన్ సంఘ్ బాధ్యుడు శ్రీనివాస్, దొంగరి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్ రెడ్డి

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

భారతదేశ శక్తిని ప్రపంచానికి చాటిన మహోన్నతుడు భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని పలువురు వక్తలు కొనియాడారు. నర్సంపేట, వర్ధన్నపేట పర్వతగిరి, నల్లబెల్లి, సంగెం మండల కేంద్రాల్లో, ఆయా గ్రామాల్లో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరలులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



నర్సంపేట : వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి



పర్వతగిరి : వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నల్లబెల్లి: పండ్లు పంపిణీ చేస్తున్న అశోక్ గౌడ్



సంగెం : కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కాళీప్రసాదరావు, బీజేపీ నేతలు



వర్ధన్నపేట : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కొండేటి శ్రీధర్